క్లుప్తంగా

భావితరాల కోసం మొక్కలు నాటాలి



మచిలీపట్నంటౌన్: భావితరాల మనుగడ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. 11వ డివిజన్ లక్ష్మణరావుపురంలోని పార్కులో ఆదివారం ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. ఇప్పుడు నాటిన మొక్కలు కొంత కాలానికి పెద్దవి అవ్వడంతో భావితరాల వారికి మేలు జరుగుతుందని చెప్పారు. మన పెద్దలు పెట్టిన మొక్కలు ఇస్తున్న నీడ, పండ్లను మనం అనుభవిస్తున్నామని చెప్పారు. ఇప్పుడు మనం నాటిన మొక్కలు భావితరాలకు ఉపయోగపడతాయన్నారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గూడవల్లి నాగరాజు మాట్లాడుతూ పార్కుకు విచ్చేసే వారికి ఆహ్లాదం, ఆనందం కలిగించేందుకు మొక్కలను నాటుతున్నామని చెప్పారు. డివిజన్ ప్రజలతో పాటు పరిసర డివిజన్ల ప్రజలు పార్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గూడవల్లి నాగమణి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్తోత్ర పఠన పోటీలు



మచిలీపట్నంటౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ సత్యసాయి సేవా సమాజం ఆధ్వర్యంలో ఆదివారం బుట్టాయిపేటలోని దత్తాశ్రమంలో విద్యార్థులకు స్తోత్ర పఠన పోటీలు నిర్వహించారు. నగరంలోని పలు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. సేవా సమాజం నిర్వాహకుడు పి. ఆంజనేయకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు పోటీలు ఏర్పాటు చేశామని చెప్పారు. తరగతుల వారీగా వివిధ రకాల స్తోత్రాల పఠన పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సీహెచ్ గోవర్ధన్, టి. సుబ్బారావు, ఎంఎం శ్రీనివాసరావు, టి. శోభారాణి, పి. నాగమణి, విశాలాక్షి, సింధూజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బందరులో క్రాఫ్ట్ బజారు ప్రారంభం



మచిలీపట్నంటౌన్: నగరంలోని లేడీస్ క్లబ్ ఆవరణలో ఆదివారం క్రాఫ్ట్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో క్రాఫ్ట్ బజారును నిర్వాహకులు ప్రారంభించారు. క్రాఫ్ట్ బజారులో చేనేత వస్త్రాలు, హస్తకళా వస్తువులను ఏర్పాటు చేశారు. ఈ క్రాఫ్ట్ బజార్‌లో దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన హస్తకళా వస్తువుల విక్రయదారులు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఉదయం 11 నుంచి రాత్రి 9.30 గంటల వరకు క్రాఫ్ట్ బజారు తెరిచి ఉంటుందని నిర్వాహకుడు ఎం. శ్రీనివాస్ తెలిపారు. క్రాఫ్ట్ బజారును నెలరోజుల పాటు నిర్వహిస్తామన్నారు. ఖాదీవస్త్రాలు, బెంగాలీ కాటన్ చీరలు, సారంపూర్ వుడ్ ఐటమ్స్, ఇమిటేషన్ జ్యూయలరీ, వరంగల్ టవల్స్, కలంకారీ డ్రెస్సులు, జైపూర్ బెడ్‌షీట్స్, లెదర్ క్రాఫ్ట్, కాశ్మీర్ టాప్స్, రెడీమేడ్ డ్రెస్సులు, ఫ్లవర్ పాట్స్, రాజస్థాన్ గాజులు తదితర క్రాఫ్ట్ వస్తువుల ప్రదర్శన, అమ్మకం జరుగుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాస్ కోరారు.

ఆర్థిక సాయం అందజేత

అవనిగడ్డ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాత ఎడ్లంకకు చెందిన పాలెపు సూర్యచంద్రకు శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాం కిశోర్ నాయుడు రూ.7 వేలు ఆర్థిక సహాయం అందించారు. రోడ్డు ప్రమాదానికి గురై మంచం పట్టిన సూర్యచంద్రకు ఆదివారం ఈ మొత్తాన్ని ఆయన అందజేశారు. కార్యక్రమంలో పాలెపు వెంకటేశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.

మైక్‌సెట్ వితరణ

మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న గంగానమ్మ ఆలయానికి ఆదివారం మండవల్లి హిందూ ధర్మ సమితి సభ్యులు మైక్‌సెట్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో విశిష్టత సంతరించుకున్న గంగానమ్మ ఆలయానికి మైక్ సెట్ అందజేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సభ్యులు సురేష్, గోపీ, సురేంద్ర, ఆది, శివకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

జగజ్జననీ.. పాహిమాం..

- దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- అమ్మవార్లకు ప్రత్యేక పూజలు
- ప్రత్యేక అలంకారాల్లో అమ్మవార్ల దర్శనం

కోడూరు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అవనిగడ్డ, పెడన, మచిలీపట్నం నియోజకవర్గాల్లోని ఆలయాలు, ప్రధాన కూడళ్లలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో చేరుకున్న భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. తొలిరోజు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. కోడూరులోని గంగాభవానీ అమ్మవారు బాలాత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ మంత్రోచ్ఛరణల నడుమ మహిళలచే సామూహిక కుంకుమార్చన భక్తిప్రపత్తులతో నిర్వహించారు. సంతమార్కెట్ సమీపంలోని కనకదుర్గమ్మ అమ్మవారు బాలా త్రిపుర సుందరీగా దర్శనమివ్వగా, మూలమూర్తికి చేసిన బంతిపూల అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. విశ్వనాథపల్లి, మందపాకలలోని అద్దంకి నాంచారమ్మ, మాచవరంలోని తుంగపల్లెమ్మ, లింగారెడ్డిపాలెం బాలా త్రిపుర సుందరీదేవి, కోడూరులోని పార్వతీదేవి, దానాశక్తి అమ్మవారి ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నరసింహాపురంలో దుర్గాదేవి విగ్రహాన్ని నెలకొల్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాగాయలంకలో..

నాగాయలంక: స్థానిక కృష్ణాతీరంలోని శ్రీరామ పాదక్షేత్రం ప్రాంగణంలోని కనక దుర్గమ్మ ఆలయంలో ఆదివారం దసరా ఉత్సవాలను కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఉభయదాతలుగా సబ్బినేని శివప్రసాద్, శిరీష దంపతులు పీటలపై కూర్చుని అమ్మవారికి విశేష పూజ, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు భవానీ దీక్ష స్వీకరించారు. ఉప్పల లీలాకృష్ణప్రసాద్, బోయపాటి రాము పాల్గొన్నారు. గణపేశ్వరంలోని దుర్గా, గణపేశ్వరస్వామి ఆలయాల్లో దుర్గమ్మ బాలాత్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మకర్త మండల రాంబాబు ఆధ్వర్యంలో అర్చకులు పోతుకూచి సత్యనారాయణ, నాగ వెంకట సాయి శర్మ పూజలు జరిపారు. భావదేవరపల్లిలో కాశీ విశ్వేశ్వరస్వామి సమేత అన్నపూర్ణాదేవి ఆలయం, గ్రామదేవత అంకాలదేవర ఆలయంలో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ ముమ్మారెడ్డి సత్యనారాయణ(సత్తిబాబు), ధర్మకర్త పూషడపు నిరంజనరావు, నాగాయలంక పీఏసీఎస్ అధ్యక్షుడు ఎంవీ సాంబశివరావు పాల్గొన్నారు. టి.కొత్తపాలెంలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు అంబా సాయికిరణ్ శర్మ అమ్మవారిని అలంకరించి పూజలు జరిపారు.

కన్యకాంబ ఆలయంలో..

నాగాయలంక: స్థానిక పార్వతీ సమేత కన్యకా పరమేశ్వరి సమన్విత నగరేశ్వర స్వామి వారి దేవస్థానం, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తాడికొండ లక్ష్మీనారాయణ-మహాలక్ష్మీ దంపతులు పూజాదికాలు నిర్వహించారు. ఆలయంలోని పార్వతీదేవి, కన్యాకాపరమేశ్వరి దేవీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు, తాడికొండ సత్యనారాయణ, చిట్టా అన్నపూర్ణయ్య, రాచంశెట్టి నాగమల్లేశ్వరరావు, ఆకుతోట సీతారామయ్య, చిట్టా హరేకృష్ణ పాల్గొన్నారు.

- ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): ఉత్తర చిరువోలులంకలోని గుర్రమ్మ అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ నడకుదుటి గోవిందరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉజ్జయిని పూజలు నిర్వహించారు. నాలుగేళ్లుగా మహారాష్ట్రలోని భోపాల్‌కు చెందిన పండితులు వకీల్ శర్మ, సుభాష్ శర్మచే కోల్‌కతాలోని ఉజ్జయిని మహంకాళీ మాతకు చేసేవిధంగా పూజలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. దసరా మహోత్సవాల సందర్భంగా ఈ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పెదకళ్లేపల్లిలో..

మోపిదేవి: దక్షిణ కాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లిలోని దుర్గా, పార్వతి సమేత నాగేశ్వరస్వామి వారి దేవస్థానంలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష కుంకుమార్చన నిర్వహించారు. కొక్కిలిగడ్డలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. పెదప్రోలులోని అద్దంకి నాంచారమ్మ ఆలయంలో దుర్గాదేవి అమ్మవారిని నెలకొల్పారు. పలు గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలు నెలకొల్పి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

బంటుమిల్లిలో..

బంటుమిల్లి: మండల పరిధిలో గ్రామ, గ్రామాన కొలువై ఉన్న శివాలయాలు, వైష్ణవాలయాల్లో అమ్మవార్లను పలు అలంకారాల్లో తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు చేశారు. బంటుమిల్లి కనకదుర్గ ఆలయం, పెద్దతుమ్మిడి శివాలయం, పాచ్చాపురం ఆంజనేయస్వామి ఆలయం తదితర ఆలయాల్లో అమ్మవారు బాల త్రిపుర సుందరీ దేవిగా, బంటుమిల్లి వెంకటేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయాల్లో అమ్మ వారు ఆదిలక్ష్మీదేవి అలంకారాల్లో భక్తులు దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమ పూజలు జరిగాయి.

- కృత్తివెన్ను: దసరా ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆలయాల వద్ద భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చనలు జరిగాయి. దసరా నవరాత్రులను పురస్కరించుకుని ఆలయాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.
- నడకుదురు(చల్లపల్లి): గ్రామంలోని ప్రాచీన పృథ్వీశ్వర స్వామి వారి దేవస్థానంలో దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం తొలి రోజు అమ్మవారిని బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. వేద పండితులు కంఠంరాజు సాయిబాబు శివాచార్య నేతృత్వంలో పంచామృత అభిషేకాలు, రుద్రాభిషేకం, భక్తులచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని, స్వామివారిని దర్శించుకున్నారు.
- పెడన: పెడన పట్టణంలోని గ్రామ దేవత పైడమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని మొదటి రోజు బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. బూసం గిరిధర్‌కుమార్, కాశీ అన్నపూర్ణ దంపతులచే పూజాదికాలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారితో పాటు ఈఓ టీవీవీ మోహనరావు పర్యవేక్షించారు. ముత్యాలమ్మ ఘటం దేవస్థానంలో కొసనం హేమానందం, కోమలి దంపతులు పూజలు చేశారు. కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ దేవి హోమం, సామూహిక లలితా సహస్ర నామ కుంకుమార్చనలు, నీరాజన మంత్రపుష్ప కార్యక్రమాలను నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నియోజకవర్గంలో దసరా ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పూజల్లో పాల్గొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు. బుట్టాయిపేటలోని దత్తాశ్రమంలో అమ్మవారు గౌరీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి పసుపుకొమ్ములతో అర్చన నిర్వహించారు. చండీహోమం, పూర్ణాహుతి, అన్నదానం జరగాయి. స్థానిక ఆజాద్‌రోడ్డులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో పార్వతీదేవి అమ్మవారు బాల త్రిపురసుందరీ దేవిగా, కన్యకా పరమేశ్వరి అమ్మవారు ఆదిలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 8.30 గంటలకు కలశస్థాపన పూజల్లో కన్యకా పరమేశ్వరి ఆలయంలో తాడేపల్లి మెహర్‌బాబా, శ్యామల, గుడివాడ మెహర్‌ప్రసాద్, సుజాత దంపతులు, పార్వతీదేవి సన్నిధిలో మోటమర్రి బాబాప్రసాద్, శ్రీదేవి దంపతులు పూజలు నిర్వహించారు. శ్రీలలిత, విష్ణు సహస్ర నామార్చన పారాయణ జరిగింది. విన్నకోట కోమలి భ్రమరాంబిక ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి. సినీ బాలనటి చండిగ మేఘన శ్రీలక్ష్మీ చేసిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. రాబర్ట్‌సన్‌పేటలోని రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో రాజరాజేశ్వరి అమ్మవారికి పూజలు నిర్వహించారు. రాజుపేటలోని ముత్యం గుడిలో భ్రమరాంబికాదేవి బాలత్రిపురసుందరిదేవిగా దర్శనమిచ్చారు. ఈడేపల్లి శక్తిగుడిలో కాళికాదేవికి పూజలు చేశారు. భాస్కరపురంలోని త్రిశక్తిపీఠంలో శక్తి అమ్మవారు లలితా త్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిచ్చారు. రేవతి సెంటర్‌లోని గంగానమ్మ ఆలయం, ప్రధాన రహదారిలోని దుర్గాదేవి ఆలయం, బెల్లపుకొట్ల వీధిలోని మహాలక్ష్మీ అమ్మవారి ఆలయాల్లో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇదిలా ఉండగా శక్తిపటాలు ధరించిన భక్తులు శనివారం అర్ధరాత్రి శ్మశానాలకు వెళ్లి పూజలు నిర్వహించి ఆదివారం పటాలతో ఊరేగింపు నిర్వహించారు.



బందరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి అలంకారం



ఈడేపల్లి శక్తిగుడిలో భక్తుల పూజలు



భావదేవరపల్లిలో బాలా త్రిపురసుందరిగా అన్నపూర్ణాదేవి



బంటుమిల్లి కనకదుర్గ ఆలయంలో అమ్మవారి అలంకారం



కృత్తివెన్ను శివాలయంలో అమ్మవారి అలంకరణ



పెదకళ్లేపల్లిలో బాలా త్రిపుర సుందరీ దేవిగా దుర్గాదేవి అమ్మవారు



బాలాత్రిపుర సుందరీదేవిగా కోడూరు గంగాభవానీ అమ్మవారు



నడకుదురులో అమ్మవారి అలంకరణ



కన్యకాపరమేశ్వరీ ఆలయంలో బాలా త్రిపుర సుందరిగా పార్వతీదేవి



పెడనలో ప్రత్యేక అలంకరణలో పైడమ్మ అమ్మవారు



పెడనలో కన్యకాపరమేశ్వరిదేవి అలంకరణలో వాసవీ మాత

అబ్దుల్ కలాం సేవలు ఆదర్శం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: మాజీ రాష్ట్రపతి, అణుశాస్త్రవేత్త దివంగత ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా అబ్దుల్‌కలాం దేశానికి అందించిన సేవలు ఆదర్శనీయమన్నారు. విజన్ 2020తో పనిచేసిన ఆయన ముందుచూపు వల్ల నేడు భారత్ యువశక్తితో తిరుగులేని దేశంగా ఎదిగిందని చెప్పారు. ఆయన నిరాడంబర జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. ఎంతో కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించిన కలాం జీవితం ప్రతి విద్యార్థికి మార్గదర్శకంగా నిలుస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళి

మచిలీపట్నంటౌన్: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమం ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. నేతాజీ మిత్రమండలి ఆధ్వర్యంలో విజయవాడ రోడ్డులోని సంఘ కార్యాలయంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలను సంఘ ప్రతినిధులు కొనియాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్‌ఐ పిళ్లారిశెట్టి శ్రీనివాసరావు, రిటైర్డ్ ఎంఈఓ కారుమూరి రాజేంద్రప్రసాద్, రిటైర్డ్ తహసీల్దార్ బి. సత్యనారాయణసింగ్ తదితరులు పాల్గొన్నారు. అజ్మీర్‌బాబా దర్గా సేవా సమాజం ఆధ్వర్యంలో స్థానిక వర్రెగూడెంలోని కార్యాలయంలో అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమం నిర్వహించారు. కలాం చిత్రపటానికి వైజ్‌మెన్ క్లబ్ అధ్యక్షుడు సయ్యద్‌పీర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కలాం సేవలను కొనియాడారు. దేశం సాంకేతిక ప్రగతి సాధించేందుకు ఆయన కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సయ్యద్‌బాజీ, నాగేశ్వరరావు, షేర్‌అలీ, రవి, నితిన్, ఇస్మాయిల్, హుస్సేన్, సుబ్బారావు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో..

నాగాయలంక: అబ్దుల్ కలామ్ జయంతి కార్యక్రమం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నాగాయలంక సబ్ బ్రాంచి, సుదర్శి మానవతా సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ట్రాఫిక్ ఐలాండ్ ప్రధాన కూడలిలో ఆదివారం రాత్రి నిర్వహించారు. తొలుత రెడ్ క్రాస్ చైర్మన్ భోగాది శివ విష్ణువర్ధన్, సుదర్శి అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ కలామ్ చిత్రపటం వద్ద క్యాండిల్స్ వెలిగించి నివాళులర్పించారు. యూత్‌సర్కిల్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం కలలను సాకారం చేద్దాం

అవనిగడ్డ: యువశక్తిని ఉపయోగించుకుని గొప్ప దేశంగా ఎదగాలనే దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం కలలను సాకారం చేసేందుకు యువత నడుం బిగించాలని సెర్ప్ సీఈఓ ఎండీ ఇంతియాజ్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో ఏపీజె అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మనదేశంలో యువశక్తి చాలా ఎక్కువగా ఉందని, దానిని ఉపయోగించుకుని అబ్దుల్‌కలాం ఆశించిన విజన్‌ను సాధించాలని చెప్పారు. ఈ సందర్భంగా ఇంతియాజ్‌ని ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు ఘనంగా సత్కరించారు. గ్రంథాలయ అధికారి జె. ప్రభుదాస్, డీఆర్‌డీఏ ఏసీ రవిబాబు పాల్గొన్నారు.



అవనిగడ్డలో కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



ఇంతియాజ్‌ను సత్కరిస్తున్న కొక్కిలిగడ్డ, సింహాద్రి వెంకటేశ్వరరావు



కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతాజీ మిత్ర మండలి సభ్యులు

సమాజ ఆరోగ్యానికి పచ్చదనం అవసరం

గుడివాడ టౌన్(నందివాడ): వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు సమాజ సేవ ప్రాతిపదికగా గుడివాడ సైకిల్ క్లబ్ పనిచేస్తోందని క్లబ్ నిర్వాహకులు అన్నారు. ఆదివారం నందివాడ మండలం తమిరిశ గ్రామంలోని ఓ ప్రైవేటు కంపెనీ ప్రాంగణంలో సైకిల్‌క్లబ్ సభ్యులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ సైక్లింగ్ ఆరోగ్యానికి మంచిదని భావించిన కొద్దిమందితో ప్రారంభమైన ఈ క్లబ్ ఏడాది తిరుగక ముందే పెద్ద సంఖ్యలో సభ్యులు చేరారని, ఎన్నో కార్యక్రమాలు క్లబ్ నిర్వహిస్తోందన్నారు. స్పిన్‌టెక్స్ యాజమాన్యం పచ్చదనం-పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ మొక్కలు నాటే కార్యక్రమం మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారని వివరించారు. క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి రోజాకు ఘనస్వాగతం

పెడన: రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆర్‌కే రోజాకు ఆదివారం సాయంత్రం వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. మంత్రి రోజా జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం ముగించుకుని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌తో కలిసి బంటుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశానికి భారీ ర్యాలీగా బయల్దేరారు. గూడూరులో, పెడన బ్రహ్మపురంలో, తోటమూల సెంటర్, బంటుమిల్లి నారాయణ పురం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. మంత్రి రోజాతో పాటు పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, యువ నాయకుడు జోగి రాజీవ్ పాల్గొన్నారు.



మంత్రులు రోజా, జోగి రమేష్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

దరఖాస్తుల ఆహ్వానం

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జి. గీతాబాయి ఆదివారం తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపిస్ట్ రెండు పోస్టులు, స్టాఫ్ నర్స్ 24, మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్ 8 పోస్టులు, మెడికల్ ఆఫీసర్ 10, ఎల్‌జీఎస్ నాలుగు పోస్టులు, సపోర్టింగ్ స్టాఫ్ మూడు పోస్టులు, సెక్యూరిటీ గార్డ్ పోస్ట్ భర్తీ చేయనున్నామని చెప్పారు. మొత్తం 52 పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. దరఖాస్తు ఫారాలు వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈ నెల 20వ తేదీలోగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

- చల్లపల్లి: ప్రతి ఒక్కరూ చేతుల పరిశుభ్రత పాటించాలని పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు అన్నారు. ఆదివారం గ్లోబల్ హ్యాండ్ వాష్ దినోత్సవం స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. చేతుల పరిశుభ్రతతో వ్యాధుల బారిన పడకుండా ఉంటామని చెప్పారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు చేతులు శుభ్రం చేసుకునే విధానం, ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు.